క్లుప్తంగా

విద్యార్థినుల రక్షణకు చర్యలు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీ టీమ్‌ సభ్యులు

శంకర్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థినుల రక్షణ కోసం ఎన్నో చర్యలు తీసుకుంటుందని షీ టీమ్స్‌ హెడ్‌ కానిస్టేబుల్‌ వెంకటయ్య అన్నారు. మంగళవారం శంకర్‌పల్లి ఆదర్శ పాఠశాలలోని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు పాఠశాల, కళాశాల, ఇంటా, బయట ఎక్కడైనా అసౌకర్యానికి గురైతే షీం టీమ్స్‌ బృందాలకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎవరైనా నిర్భయంగా సమాచారం ఇవ్వొచ్చని, ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచనున్నట్లు భరోసా కల్పించారు. కార్యక్రమంలో షీ టీమ్స్‌ సభ్యులు రవీందర్‌రెడ్డి, రాజ్యలక్ష్మి, ప్రిన్సిపాల్‌ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కేశంపేట: మండల కేంద్రంలో చాకలి అంజయ్య ఆకస్మికంగా మృతి చెందాడు. మృతుడిది నిరుపేద కుటుంబం కావడంతో అంత్యక్రియల నిమిత్తం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, గుండ్రాతి రమణయ్యగౌడ్‌ రూ.5వేల చొప్పున, తలసాని పవన్‌ కుమార్‌రెడ్డి రూ.3వేల ఆర్థిక సాయాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు మంగళవారం అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ యెన్నం శ్రీధర్‌రెడ్డి, అనసూయ, ఆంజనేయులు, రాములు, నారాయణ, యాదయ్య, గణేశ్‌, వెంకటేశ్‌, చందు, శంకర్‌ పాల్గొన్నారు.

హద్దురాళ్ల తొలగింపు



హద్దురాళ్లను తొలగిస్తున్న ఆర్‌ఐ నివేధిత, సిబ్బంది

కేశంపేట: మండల పరిధిలోని బైర్కాన్‌పల్లి గ్రామంలో భూ యజమాని పాతుకున్న హద్దురాళ్లను ఆర్‌ఐ నివేధిత సిబ్బందితో కలిసి మంగళవారం తొలగించారు. గ్రామ శివారులోని సర్వే నంబర్‌ 53లో 4ఎకరాల ప్రభుత్వ భూమిని, సర్వే నంబర్‌ 53/37లోని యజమాని కబ్జా చేస్తున్నాడని సోమవారం గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు భూమిని సర్వే చేసే వరకు ఎలాంటి హద్దురాళ్లను పాతుకోవద్దని రెవెన్యూ అధికారులు భూ యజమానికి సూచించారు.

యోగా శిక్షణ కరపత్రాల ఆవిష్కరణ

కొందుర్గు: మండల కేంద్రంలోని పంచలింగేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో హార్ట్‌ ఫుల్‌నెస్‌ శ్రీరామచంద్రమిషన్‌ ఆధ్వర్యంలో ఉచిత యోగా శిక్షణ నిర్వహిస్తున్నామని సంస్థ ప్రతినిధులు మురగేశ్‌ తెలిపారు. ఈ సందర్భంగా శిక్షణ కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 26, 27, 28 తేదీల్లో సాయంత్రం 5 గంటలకు నిర్వహించే ఈ శిక్షణకు అందరు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు విజయ్‌, కార్తీక్‌, మండల వాసులు గణేశ్‌, మల్లారెడ్డి, నర్సింలుగౌడ్‌, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయ ఆవరణలో కాంక్రీట్‌ పనులు

నందిగామ: మండల పరిధిలోని ఉమ్మడి చేగూరు శివారులోని మల్లికార్జునస్వామి దేవాలయ ఆవరణలో మంగళవారం కాంక్రీట్‌ పనులను చేపట్టారు. గ్రామానికి చెందిన కాంగ్రెస్‌ పార్టీ సీనియర్‌ నాయకుడు మంకాల శ్రీశైలం తన సొంత డబ్బు రూ.2లక్షల వ్యయంతో కాంక్రీట్‌ పనులను చేయిస్తున్నారు. ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ.. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగవద్దనే ఉద్దేశంతో పనులను చేయిస్తున్నట్లు చెప్పారు. పనులను చేయిస్తున్న శ్రీశైలంను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్‌ ప్రసాద్‌, ఆలయ కమిటీ అధ్యక్షుడు దారుర్‌ సతీశ్‌, ఆలయ అర్చకుడు వీరేషం, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేతనాలు సకాలంలో చెల్లించాలని వినతి

షాద్‌నగర్‌రూరల్‌: ఉపాధ్యాయులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని టీఎస్‌యూటీఎఫ్‌ జిల్లా కార్యదర్శి వెంకటయ్య కోరారు. ఈ మేరకు మంగళవారం టీఎస్‌యూటీఎఫ్‌ నాయకులు సబ్‌ట్రెజరీ కార్యాలయంలో అధికారులు బాల్‌రాజ్‌, మహేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ.. వేతనాల చెల్లింపులో ఎలాంటి అవకతవకలకు తావివ్వకుండా సకాలంలో వేతన బిల్లులను పాస్‌ చేయాలన్నారు. ఆదాయ పన్ను చెల్లిస్తున్న ఉపాధ్యాయుల వివరాలలో ఏమైనా తప్పులు ఉంటే మాకు తెలియజేయాలని సబ్‌ట్రెజరీ అధికారులను కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో టీఎస్‌యూటీఎఫ్‌ నాయకులు ఉన్నారు.

శివరాత్రికి ఆలయాలు ముస్తాబు

శివరాత్రి పర్వదిన వేడుకలకు నియోజకవర్గాల్లోని శివాలయాలు ముస్తాబయ్యాయి. ఉత్సవాలకు గాను ఆలయాలకు రంగులు వేసి విద్యుత్‌ దీపాలతో అలంకరించారు. జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు. భక్తుల దర్శనార్థం క్యూ లైన్లు, టెంట్లు వేశారు. బుధవారం ఉదయం 4 గంటల నుంచే పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ సభ్యులు స్పష్టం చేశారు.



మొయినాబాద్‌లో ముస్తాబైన శివాలయం



మొయినాబాద్‌రూరల్‌: ముస్తాబైన శివాలయం



శంకర్‌పల్లి: ముస్తాబైన మరకత శివాలయం



చేవెళ్లలోని కొనగట్టు శివాలయం

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: ప్రజాసంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్‌ ప్రభుత్వం పాలన కొనసాగిస్తోందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలంలోని ఇంద్రారెడ్డినగర్‌, ఖానాపూర్‌, రేగడిఘనాపూర్‌ గ్రామాల్లో సీసీరోడ్డు పనులకు మంగళవారం ఆయన స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఉన్న అన్ని వార్డుల్లో సీసీరోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులతో అన్ని గ్రామాల్లో రోడ్లు వేస్తున్నారని, ఇంకా గ్రామాల్లో మిగిలిపోయిన రోడ్లు కాని, అండర్‌ గ్రౌండ్‌ డ్రైనేజీలను కూడా పూర్తిచేసేందుకు నిధులు తీసుకొస్తానన్నారు. ఈ సందర్భంగా ఇంద్రారెడ్డినగర్‌లో రూ.10లక్షలు, ఖానాపూర్‌లో రూ.15లక్షలు, రేగడిఘనాపూర్‌లో రూ.15లక్షల నిధులతో వేస్తున్న సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ జి.పెంటయ్యగౌడ్‌ పీఏసీఎస్‌ ముడిమ్యాల చైర్మన్‌ గోనే ప్రతాప్‌రెడ్డి, ఆయా గ్రామాల పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



రేగడిఘనాపూర్‌లో పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, నాయకులు

గ్రామాల అభివృద్ధికి కృషిచేయాలి

ఎంపీడీఓ వెంకయ్య

శంకర్‌పల్లి: గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ వెంకయ్య అన్నారు. మంగళవారం మండల పరిషత్‌ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. నర్సరీలను నిత్యం పరిశీలించి, మొక్కలకు నీరు పోయించాలని, గ్రామాల్లో పన్ను వసూలు, ఉపాధి హామీ పనులు, పారిశుద్ధ్య పనుల నిర్వహణ, ప్లాస్టిక్‌ నిర్మూలనపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యదర్శులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని, అలాంటి వారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

ఆలయానికి విరాళం



ఆలయ కమిటీ చైర్మన్‌కు నగదు అందిస్తున్న ఇంద్రసేనారెడ్డి

శంకర్‌పల్లి: పట్టణంలోని 14వ వార్డులో గల వీరాంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి మండలంలోని చెందిప్ప గ్రామానికి చెందిన ఇంద్రసేనారెడ్డి రూ.30వేల విరాళం ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం ఈ మొత్తాన్ని నగదు రూపంలో ఆలయ కమిటీ చైర్మన్‌ పాండురంగారెడ్డికి అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గుండా శేఖర్‌, నాయకులు మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దైవచింతన అలవర్చుకోవాలి



పడిపూజలో పాల్గొన్న స్వాములు

షాబాద్‌: ఆధ్యాత్మిక చింతనతోనే ప్రతీ ఒక్కరికి మానసిక ప్రశాంతత కలుగుతుందని గురుస్వామి ప్రశాంత్‌ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని మద్దూరు గ్రామానికి చెందిన శివస్వాములు శివస్వామి మహాపడిపూజను ఘనంగా నిర్వహించారు. అనంతరం శివస్వాములకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో స్వాములు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

విద్యుత్‌ లైను ఏర్పాటుపై వినతి

కొత్తూరు: తమ గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న 33కేవీ కొత్త లైన్‌ను గ్రామానికి దూరంగా ఏర్పాటు చేయాలని కోరుతూ మండలంలోని పెంజర్ల గ్రామానికి చెందిన పలువురు గ్రామస్తులు మంగళవారం ట్రాన్స్‌కో ఏఈ రమేశ్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొత్తగా వేసే లైను కోసం స్తంభాలు ఏర్పాటు చేసేందుకు అధికారులు గ్రామంలోని పలువురి ఇళ్లకు అతి సమీపంలో తవ్వకాలు జరిపినట్లు తెలిపారు. ఇళ్ల సమీపం నుంచి కొత్తగా విద్యుత్‌ తీగలు, స్తంభాలను ఏర్పాటు చేస్తే ప్రమాదాలు చోటు చేసుకుంటాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల సమీపంలో నుంచి కాకుండా మరోమార్గంలో స్తంభాలు, తీగలను ఏర్పాటు చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో దేశాల జైపాల్‌, ఎర్రోళ్ల జగన్‌, ఖదీరొద్దీన్‌, ఆశోక్‌ తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌, నాయకులు

షాద్‌నగర్‌: మహాశివరాత్రిని పురస్కరించుకొని ఫరూఖ్‌నగర్‌ మండల పరిధిలోని రామేశ్వరం గ్రామంలో ఉన్న రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌ పాల్గొని శివలింగానికి అభిషేకం, పూజలు చేశారు.

క్రీడలకు అధిక ప్రాధాన్యత

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌



బహుమతి అందుకుంటున్న కొందుర్గు జట్టు

కొందుర్గు: రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ అన్నారు. మండలంలోని ఉత్తరాసిపల్లి గ్రామంలో ఈ నెల 16న ప్రారంభమైన మండలస్థాయి క్రికెట్‌ టోర్నమెంట్‌ మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అంతకుముందు ఎమ్మెల్యే మహదేవ్‌పూర్‌, బైరంపల్లి గ్రామాల్లో అండర్‌ డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

దేవాలయ అభివృద్ధికి కృషి

షాద్‌నగర్‌: దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ అన్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని మంగళవారం షాద్‌నగర్‌ పట్టణంలోని 9వ వార్డులో గల విజయ్‌నగర్‌ కాలనీలోని భవానీ సహిత సహజ లింగేశ్వరస్వామి దేవాలయంలో శివపార్వతుల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పనులను వేగంగా పూర్తిచేయాలి

మున్సిపల్‌ కమిషనర్‌ యోగేశ్‌

శంకర్‌పల్లి: మున్సిపాలిటీ పరిధిలో పెండింగ్‌లో రోడ్డు నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని మున్సిపల్‌ కమిషనర్‌ యోగేశ్‌ అన్నారు. మంగళవారం ఆయన శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్‌, చేవెళ్ల ట్రాఫిక్‌ సీఐ వెంకటేశం, ఆర్‌అండ్‌బీ డీఈఈ రమేశ్‌, ఏఈ చంద్రశేఖర్‌రెడ్డిలతో కలిసి పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులను పరిశీలించి మాట్లాడారు. చేవెళ్ల–శంకర్‌పల్లి ప్రధాన రహదారి విస్తరణ పనులు ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయని, అదే విధంగా ఫత్తేపూర్‌ రైల్వే వంతెన ప్రారంభ, ముగింపుల వద్ద రోడ్డు వేయాలని, బ్రిడ్జి క్రింద వర్షపు నిల్వకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు. నిర్మాణ పనులు అయ్యే సమయంలో ట్రాఫిక్‌ ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు పోలీసులు కృషి చేస్తారని తెలిపారు. ఈ పనులన్నింటినీ వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఉపేక్షించం

తహసీల్దార్‌ కృష్ణయ్య

చేవెళ్ల: ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని మండల తహసీల్దార్‌ కృష్ణయ్య అన్నారు. మండలంలోని కమ్మెట గ్రామంలో సర్వే నెం.270లో ఉన్న ప్రభుత్వ భూమి 2 ఎకరాలలో వేసిన ప్రీకాస్టింగ్‌ పలకలను మంగళవారం రెవెన్యూ అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను ఆక్రమించటం చట్టరీత్యా నేరమన్నారు. కమ్మెట గ్రామంలో ఉన్న 2 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించి ప్రీకాస్టింగ్‌ వేసినట్లు సమాచారం అందడంతో అక్కడికి పరిశీలించామన్నారు. రెవెన్యూ అధికారులు సర్వే రికార్డుల ప్రకారం ప్రభుత్వ భూమిలోకి వచ్చిన ప్రీకాస్ట్‌ గోడలను జేసీబీతో కూల్చివేసినట్లు తెలిపారు. అక్రమంగా ప్రభుత్వ భూమిలోకి వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూమిని సర్వే చేసి గుర్తించి హద్దులు వేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ భూమిని కాపాడుకునే బాధ్యత అధికారులదేనని, ఎవరైనా ఆక్రమిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.



ప్రభుత్వ భూమిలో వేసిన ప్రీకాస్ట్‌ నిర్మాణాలను జేసీబీతో తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

క్రీడలతో మానసికోల్లాసం

జెడ్పీటీసీ మాజీ సభ్యుడు అవినాశ్‌రెడ్డి

షాబాద్‌: క్రీడలు మానసికోల్లాంతో పాటు శారీరక దృఢత్వానికి దోహదపడుతాయని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం దివంగత నేత పట్నం రాజేందర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని పీఆర్‌ఆర్‌ స్టేడియంలో నియోజకవర్గస్థాయి క్రికెట్‌ క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు శారీర దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసానికి ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. యువత చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గత 35 సంవత్సరాలుగా షాబాద్‌లో ప్రతి ఏడాది పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తున్నామన్నారు. గ్రామాల మధ్య స్నేహ సంబంధాలను పెంచేందుకు ఇలాంటి క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. గెలుపోటములు సమానంగా స్వీకరించినప్పుడే ఉన్నత శిఖరాలను చేరుకోగలుగుతారన్నారు. కార్యక్రమంలో క్రీడా నిర్వాహకులు మహేశ్‌యాదవ్‌, రమేశ్‌యాదవ్‌, ధనుంజయ్‌, సహకార సంఘం చైర్మన్‌ శేఖర్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు గూడూరు నర్సింగ్‌రావు, కార్యదర్శి చల్లా శ్రీరాం రెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ మాజీ సభ్యుడు అవినాశ్‌రెడ్డి

దాతల సాయం అభినందనీయం

సీఐ నర్సింహారావు

కొత్తూరు: ఆలయాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు తోడ్పాటునందించిన దాతల సాయం అభినందనీయమని సీఐ నర్సింహారావు అన్నారు. పట్టణంలోని పలు ఆలయాల్లో మంగళవారం దాతలు సమకూర్చిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. ఇటీవల పట్టణంలోని పోచమ్మ ఆలయంలో జరిగిన ఓ ఘటన దృష్ట్యా గ్రామ పెద్దలు కెమెరాల ఏర్పాటుకు ముందుకురావడం సంతోషకరమని వివరించారు. కెమెరాల ఏర్పాటుతో ఆలయాల్లో సాధ్యమైనంతవరకు చోరీల నియంత్రణ, ఇతర ఘటనలు చోటు చేసుకునే వీలు ఉండదన్నారు. పోచమ్మ ఆలయంలో బీఆర్‌ఎస్‌ నేత దేవేందర్‌యాదవ్‌, హనుమాన్‌ ఆలయంలో తాండ్ర శ్రీనివాస్‌రెడ్డి, మైసమ్మ ఆలయంలో శివాచారి, ఎస్సీకాలనీలోని ఆలయంలో బీఆర్‌ఎస్‌ నాయకుడు యాదయ్య సొంత ఖర్చులతో కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్‌ కమిషనర్‌ బాలాజీ, ఎస్‌ఐలు శ్రీనివాస్‌, మురళీగౌడ్‌, నాయకులు సదానంద్‌గౌడ్‌, కృష్ణ, రవినాయక్‌, యాదగిరిచారి, శ్రావన్‌కుమార్‌యాదవ్‌, సాగర్‌, సురేశ్‌, రఘు తదితరులు పాల్గొన్నారు.



ఆలయం వద్ద మాట్లాడుతున్న సీఐ నర్సింహారావు

భక్తులకు ఇబ్బందులు రానివ్వద్దు

రామేశ్వరంలో ఏర్పాట్లను పరిశీలించిన సీఐ విజయ్‌కుమార్‌



ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న సీఐ విజయ్‌కుమార్‌ తదితరులు

షాద్‌నగర్‌రూరల్‌: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రానివ్వొద్దని పట్టణ సీఐ విజయ్‌కుమార్‌ సూచించారు. ఉత్తర రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణ సీఐ విజయ్‌కుమార్‌ రామేశ్వరం దేవాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా భక్తుల కోసం ఏర్పాటు చేసిన వసతులు, వాహనాల పార్కింగ్‌ స్థలాన్ని పరిశీలించారు. భక్తుల రాకతో వాహనాల రద్దీ, ట్రాఫిక్‌ నియమాలపై ట్రాఫిక్‌ సీఐ చంద్రశేఖర్‌తో మాట్లాడారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. మహాశివరాత్రి సందర్భంగా ఉత్తర రామలింగేశ్వరస్వామి దేవాలయానికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుందన్నారు. నియోజకవర్గంతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్‌, రంగారెడ్డి, హైద్రాబాద్‌, వికారాబాద్‌, కర్నూల్‌ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివస్తారన్నారు. దైవదర్శనం కోసం దూర ప్రాంతాల నుంచి ఇక్కడకు వచ్చే భక్తులకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. భక్తులకు కావాల్సిన అన్ని సౌకర్యాలు, వసతులు కల్పించేందుకు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తమవంతుగా కృషి చేయాలని సూచించారు. భక్తులు తమ విలువైన వస్తువులు, బంగారం వంటి వాటిని జాగ్రత్తగా చూసుకోవాలని, ఆలయ పరిసర ప్రాంతాల్లో కొత్త వ్యక్తులను నమ్మొద్దని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు సిబ్బందితో భారీ బందోబస్తు చేపడుతామన్నారు. ఏర్పాట్లను పరిశీలించిన వారిలో మాజీ సర్పంచ్‌ సంపత్‌కుమార్‌, ఆలయ ఈఓ శివకుమార్‌, ఎస్‌ఐ శరత్‌కుమార్‌, నాయకులు రాయికల్‌ శ్రీనివాస్‌ తదితరులు ఉన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్‌

మాజీ సర్పంచ్‌ జయశ్రీ

షాద్‌నగర్‌రూరల్‌: విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని మాజీ సర్పంచ్‌ జయశ్రీచంద్రశేఖర్‌ అన్నారు. మంగళవారం ఫరూఖ్‌నగర్‌ మండల పరిధిలోని విఠ్యాల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఐ సడక్‌ జడ్చర్ల ఎక్స్‌ప్రెస్‌ వే ప్రైవేట్‌ లిమిటెడ్‌ రాయికల్‌ టోల్‌ప్లాజా సహకారంతో స్వెటర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ సర్పంచ్‌ హాజరై విద్యార్థులకు స్వెటర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉన్నత విద్యతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. విద్యార్థులు ఉన్నత విద్యావంతులుగా ఎదిగినప్పుడే ఉజ్వల భవిష్యత్‌ లభిస్తుందన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థులకు స్వెటర్లు అందించిన టోల్‌ప్లాజా సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో టోల్‌ప్లాజా సిబ్బంది జగదీశ్‌, శ్రీనివాస్‌, శ్రీకాంత్‌, సందీప్‌, బీఆర్‌ఎస్‌ గ్రామ కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌, ప్రధానోపాధ్యాయుడు సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో టోల్‌ప్లాజా సిబ్బంది, నాయకులు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై అవగాహన



లబ్ధిదారురాలితో మాట్లాడుతున్న హౌసింగ్‌ అధికారులు, ఎంపీడీఓ వెంకయ్య

శంకర్‌పల్లి: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులైన లబ్ధిదారులను అధికారులు గుర్తించిన విషయం తెలిసిందే. అయితే శంకర్‌పల్లి మండలంలోని ఏర్వగూడ గ్రామాన్ని పైలట్‌ ప్రాజెక్టు కింద తీసుకొని 73మంది లబ్ధిదారులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వారిలో మొదటి విడతగా 11మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. మంగళవారం చేవెళ్ల హౌసింగ్‌ డీఈ దస్తగిరి, ఏఈ వాహబ్‌ ఏర్వగూడ గ్రామంలో పర్యటించి, లబ్ధిదారులతో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం గురించి, ఏఏ దశల్లో ఎంత మొత్తం డబ్బు వస్తుందనే విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి ఎంపీడీఓ వెంకయ్య, పంచాయతీ సెక్రటరీ హమీఫ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు ఆలయం ముస్తాబు

చేవెళ్ల: చేవెళ్లలోని శ్రీబాలాజీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం శివరాత్రి ఉత్సవాలకు సిద్ధమైంది. ఈ నెల 26వ తేదీ శివరాత్రి మొదలుకొని మార్చి 4వ తేదీవరకు ఉత్సవాలు జరుగనున్నాయి. ప్రతి ఏటా శివరాత్రికి ఈ ఆలయంలో ఉత్సవాలు నిర్వహిస్తామని, ఆలయ సభ్యులు పేర్కొన్నారు. 26 బుధవారం మహా శివరాత్రి సందర్భంగా ఆలయంలో ఉదయం 9 గంటలకు రుద్రస్వాహాకారం, హవనం పూజలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. సాయంత్రం 4 గంటలకు కల్యాణోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. 27వ తేదీ రాత్రి 10 గంటలకు పోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తారు. మార్చి 4వ వరకు కొనసాగుతాయని తగిన ఏర్పాట్లు చేశామని తెలిపారు.



ముస్తాబైన బాలాజీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయం

ఫ్రీ చికెన్‌, ఎగ్‌ స్నాక్స్‌ మేళా

షాద్‌నగర్‌రూరల్‌: కోళ్లకు బర్డ్‌ ఫ్లూ వైరస్‌ సోకిందనే ప్రచారంతో చికెన్‌ అమ్మకాలు తగ్గిపోయాయి. ప్రజలు కోడి మాంసం, కోడిగుడ్డుకు దూరంగా ఉంటున్నారు. దీంతో చికెన్‌, కోడిగుడ్డు పోషక విలువలపై ప్రజలలో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో మంగళవారం పట్టణంలోని విజయలక్ష్మి చికెన్‌ సెంటర్‌ ఆధ్వర్యంలో వెంకాబ్‌ చికెన్‌ సహకారంతో చికెన్‌, ఎగ్‌ స్నాక్స్‌ మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా చికెన్‌తో తయారుచేసిన చికెన్‌ పకోడి, ఉడికించిన కోడిగుడ్లు, స్నాక్స్‌ను ప్రజలకు ఉచితంగా అందజేశారు. చికెన్‌, కోడిగుడ్డుపై వస్తున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దని కోరారు. కార్యక్రమంలో నిర్వాహకుడు మహిపాల్‌రెడ్డి, వెంకాబ్‌ చికెన్‌ ప్రతినిధులు బాలమురుగన్‌, రఘుప్రసాద్‌, చికెన్‌ సెంటర్‌ నిర్వాహకులు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చికెన్‌పై అపోహలు వద్దు

షాబాద్‌: తెలంగాణలో కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకలేదని, నిరభ్యంతరంగా చికెన్‌, కోడిగుడ్లను వినియోగించవచ్చని చికెన్‌ సెంటర్‌ నిర్వాహకుడు మజీద్‌ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో చికెన్‌ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా చికెన్‌, ఉడికిన కోడిగుడ్లను ఉచితంగా పంపిణీ చేశారు. చికెన్‌తో రకరకాల వంటకాలను వండి అందరికీ వడ్డించారు. ఉడికించిన 2వేల గుడ్లను అందజేశారు.



షాద్‌నగర్‌రూరల్‌: చికెన్‌, ఎగ్‌ స్నాక్స్‌ను ఉచితంగా అందజేస్తున్న నిర్వాహకులు